# ఛైర్మన్ ఎన్నిక అనంతరం శాసన పరిషత్‌ను ఉద్దేశించి గౌరవ సభాధ్యక్షులు వెలువరించిన ప్రసంగం

***

**మిస్టర్ ఛైర్మన్:** అతి సామాన్య కార్యకర్తగా, దళితుడిగా, పేదవాడిగా ఉన్న నన్ను ఎంతో నమ్మకంతో ఈరోజు దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులు కలిగినటువంటి ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు ఛైర్మన్‌గా నియమించిన పెద్దలు గౌరవనీయ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్‌రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ ఎన్నికను ఏకగ్రీవంగా చేయడానికి సహకరించిన ప్రతిపక్ష సభ్యులకు, శాసనపరిషత్తు సభ్యులందరికీ కూడా నా వినయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను. నేను రాజకీయాల్లో ఈ స్థానానికి వస్తానని ఏనాడూ ఊహించలేదు. అంత అర్హత ఉన్న వ్యక్తిని కాదని నేను అనుకుంటున్నాను. కేవలం రాజకీయాల్లో వైఎస్సార్ కుటుంబంతో ఉండాలని ఆ కుటుంబ సభ్యునిగా మాత్రమే స్థానం కావాలని నేను ఎప్పుడు పరితపిస్తూ ఉండే వాడిని. కానీ జగన్మోహన్‌రెడ్డిగారు రాజకీయాల్లోకి వచ్చిన తరవాత నాన్నగారు ఒక్క అడుగు ముందుకు వేస్తే నేను రెండు అడుగులు ముందుకు వేస్తానని మాట చెప్పారు. నేను ఏంటా అని అనుకునేవాడిని. రాజశేఖరరెడ్డిగారు నాకు 2009లో టికెట్ ఇచ్చినా ఓడిపోయిన తరవాత 10రోజులకు నన్ను పిలిచి నేను ముఖ్యమంత్రి అయ్యాను నువ్వు ఓడిపోవడం వలన నీకు ఏమైనా బాధగా ఉందా అని అడిగారు. అయ్యా మీరు ముఖ్యమంత్రి అవ్వడమే మాకు కావాలి. మీ కుటుంబ సభ్యులుగా నన్ను ఉంచుకోండని నేను అడగడం జరిగింది. నేను ఎప్పటికైనా నిన్ను శాసనసభకు పంపిస్తానని వారు చెబితే ఈరోజున శాసనపరిషత్తు సభ్యునిగా అలాగే శాసనపరిషత్తు అధ్యక్షులుగా నియమించి ఆయన రెండు అడుగులు ముందుకు వేశారని నేను భావిస్తున్నాను.

రెండు అడుగులు ముందుకు వేయడం అంటే దానికి అర్థం ఇది అని నేను ఈరోజు మనస్ఫూర్తిగా అర్థం చేసుకుంటున్నాను. నాకు నిరాశ, నిస్పృహ ఉండేది. రాజకీయాల్లో డబ్బు కులం, బ్యాకింగ్ సపోర్టు ఉంటేనే రాజకీయాల్లో ముందుకు రాగలమనే అభిప్రాయం సాధారణంగా అందరికీ ఉంది. నాకూ ఉంది. కానీ ఈరోజు జగన్మోహన్‌రెడ్డిగారు దానిని పటాపంచలు చేస్తూ రాజకీయాలకు డబ్బు, కులం, బ్యాకింగ్ అవసరంలేదని విశ్వాసం, నమ్మకం, కష్టపడేతత్వం ఉంటే చాలనే లక్ష్యంతో ఒక భరోసా ఇచ్చారు.

ఈరోజు ఈ నియామకం ద్వారా ఈ రాష్ట్రంలో ఉన్న అనేకమంది దళితులు, పేదవారు, గిరిజనులు అలాగే బడుగు బలహీనవర్గాల వారు రాజకీయాల్లోకి రావచ్చు. మేము కూడా రాజకీయాలలో కొనసాగించవచ్చు అనే ఆత్మవిశ్వాసాన్ని పొందారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అటువంటి రాజకీయాలలో కష్టపడేతత్వం ఉండాలని, విశ్వాసం ఉండాలని ఆలోచించి భరోసా కల్పించిన ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, ఆయన నాపై ఎంతో నమ్మకంతో ఎంత సాహసోపేతమైన చర్యకు పూనుకున్నారో నేను దానికి రెండింతలు నమ్మకంగా, విశ్వాసంగా ఉంటానని సభాముఖంగా హామీ ఇస్తున్నాను.

నేను కూడా మున్సిపల్ కౌన్సిల్లో మూడుసార్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నాను. ప్రజాసమస్యల్ని సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి, అధికారపక్షం దృష్టికి తీసుకువెళ్లి తద్వారా ప్రజాసమస్యలు పరిష్కారం కావాలని ప్రతిపక్షం వారు కోరుకుంటారు. దాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు ఒకవంతు ఎక్కువగా ప్రతిపక్షానికే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తానని నేను హామీ ఇస్తున్నాను. అలాగే, ప్రతిపక్షం కూడా ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాల్ని, అభివృద్ధి కార్యక్రమాల్ని, సంక్షేమ కార్యక్రమాల్ని దృష్టిలో ఉంచుకుని సద్విమర్శలు చేసి, దాంట్లో ఏవైనా లోపాలుంటే గనుక ఎత్తిచూపినట్లయితే తప్పకుండా దాన్ని ఆస్వాదిస్తామని తెలియజేస్తున్నాను. అంతేతప్ప, ఎప్పుడూ ప్రభుత్వాన్ని క్రిటిసైజ్ చేయాలనే ఆలోచన ప్రతిపక్షానికి ఉండటం మంచిది కాదు. ఈ స్థానంలో ఉన్నంతసేపూ మీరు నాకిచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకుంటాను. అలాగే, ముఖ్యమంత్రి గారు నా మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నా మీద నమ్మకంతో వారు నాకు అప్పగించిన బాధ్యతలను అంతకంటే ఎక్కువ నమ్మకంతో ఆయనకు, ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలందరికీ విశ్వాసపాత్రంగా ఉంటాను. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా ప్రజలకు రాజ్యాధికారం కావాలని బాబాసాహెబ్ అంబేడ్కర్ గారి లాంటి చాలా మంది నాయకులు చెప్పారు. ఈ రోజున అటువంటి రాజ్యాధికారాన్ని దళితులకు కల్పించి, ఈ రాష్ట్రంలో ఐదుగురు మంత్రులు, ఒక ఉప ముఖ్యమంత్రి, శాసనపరిషత్తు సభ్యులు, అలాగే నాకు ఈ రోజున శాసనపరిషత్తు ఛైర్మన్‌గా అవకాశం కల్పించి అంబేడ్కర్ గారి ఆశయాలను అమలుపరిచిన ముఖ్యమంత్రి గారికి మరొక్కసారి వినయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.